మసీదులు ముస్తాబు

● రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు
● బడీ మసీదును పరిశీలించిన పలు శాఖల అధికారులు

ముషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను గురువారం చేసుకునేందుకు ముస్లింలు ఏర్పాటు చేస్తున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 23 మసీదుల వద్ద ఏర్పాట్లు చేశారు. బడీ మసీదు పరిసర ప్రాంతాలను పారిశుధ్య సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. 400 సంవత్సరాల చరిత్రగల బడీ మసీదులో ఏర్పాట్లను జలమండలి, విద్యుత్, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులు పర్యవేక్షించారు.


బడీ మసీదు వద్ద రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అంబర్‌పేటలో..

అంబర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం అంబర్‌పేటలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల ఏర్పాట్లను స్థానిక ఈద్గా కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఉదయం 9 గంటలకు అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని ఈద్గా కమిటీ సభ్యులు మహ్మద్ సమీఉల్లా తెలిపారు. ప్రార్థనలకు వచ్చే వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

సామూహిక ప్రార్థనలకు 10 వేల మంది

బడీమసీదుకు స్థానికులతోపాటు స్థానికేతరులు సామూహిక ప్రార్థనలు చేసేందుకు పదివేల మందికి పైగా హాజరుకానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని మసీదులో కూలర్‌లను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశాం.

- నజీర్‌అలీ, బడీ మసీదు ముత్తవల్లి


విద్యుత్ దీపాల వెలుగులో బడీ మసీదు


అంబర్‌పేటలో రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు


ప్రభుత్వ స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ప్రభుత్వ స్థలం కబ్జా యత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు ● హెచ్చరిక బోర్డు ఏర్పాటు

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ రైల్వే ట్రాక్ సమీపంలో ప్రభుత్వ స్థలం కబ్జా యత్నాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. స్థల వివాదం కోర్టులో కొనసాగుతుండగా.. ఓ వర్గం వారు కొంత స్థలం తమదే అంటూ గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించే ప్రయత్నం చేశారు. ఈ విషయమై స్థానికులు ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ హేమంత్ సిబ్బంది, నల్లకుంట పోలీసులతో కలిసి తొలగించిన బోర్డును తిరిగి ఏర్పాటు చేశారు. ఓ వర్గం వారు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు, అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం జరిగింది. స్థల వివాదం కోర్టులో ఉందని అధికారులు సర్దిచెప్పి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డును తొలగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ హెచ్చరించారు.


నిరసన ప్రదర్శనలో ఆర్. కృష్ణయ్య, విద్యార్థి సంఘం నేతలు

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌కు పెండింగ్‌లో ఉన్న పది నెలల మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మెస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్‌లో బుధవారం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో హాస్టల్స్‌కు నిత్యావసర వస్తువులు రావడం లేదని, దీంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారని అన్నారు. పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని విద్యార్థులతో ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అంజియాదవ్, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు శివ, భాస్కర్, ప్రీతమ్, నిఖిల్, నందగోపాల్, టి. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమజ్జయంతి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

సర్వాయి పాపన్నకు భారతరత్న ఇవ్వాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్‌కు భారతరత్న ఇవ్వాలని జాతీయ బీసీ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో బుధవారం పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరికపు వ్యవస్థ నీడలో జమీందారు, జాగీర్దారు అరాచకాలను సహించలేక కదుపుమండి కత్తిపట్టిన వీరుడు పాపన్న అని కొనియాడారు. దళిత బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చునని నిరూపించారని తెలిపారు. రాబోయే తరాలకు పాపన్న చరిత్ర తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సాయిగౌడ్, మహేష్, శ్రీను, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

'రాజీవ్‌రహదారి ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి(హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు) ఎవరి అధీనంలో ఉందో తెలియజేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాష్ట్ర రహదారి భద్రతాధికారులకు బాధిత కుటుంబాలు మొరపెట్టుకున్నాయని అన్నారు. రాజీవ్ రహదారిపై నిబంధనల ప్రకారం రక్షణ సౌకర్యాలు (ట్రామా కేర్ సెంటర్లు) ఏర్పాటు చేసే వరకు టోల్ చార్జీల వసూలును నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


కోదండరెడ్డి ద్వారా గాంధీభవన్‌కు అందజేసిన సమరయోధుల చిత్రం

పింగళి వెంకయ్య చరిత్ర భావితరాలకు తెలియజేసేందుకు చర్యలు

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి సూచించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీపరంగా కృషి చేస్తామన్నారు.

పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కేహెచ్ఎస్ జగదాంబ, చైర్మన్ శ్యామలరావు ఆధ్వర్యంలో పింగళి వెంకయ్యతోపాటు సమరయోధుల చిత్రాలతో కూడిన ఫొటోను కోదండరెడ్డి ద్వారా గాంధీభవన్ ఇన్‌చార్జి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావుకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జీఎన్. కేశవ్, ట్రస్ట్ సభ్యులు జశ్వంత్, శ్రీకాంత్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్ల సాధనకు పోరాటం'

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి కేఎం రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో బీఎంఎస్ నగర కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆలిండియా కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో పుణేలో జరిగిన సమావేశ వివరాలను ఆయన వివరించారు.

ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీపై యూటీఎఫ్ అభ్యంతరం

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో అప్రమత్తమైన గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల సంఖ్యను రెండు నుంచి నాలుగుకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని యూటీఎఫ్ నేతలు ఖండించారు. బుధవారం దోమలగూడలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, సోషల్ వెల్ఫేర్ గురుకుల ఉపాధ్యాయుల విభాగం అధ్యక్షుడు డి.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శశిధర్, కోశాధికారి ఎండీ అనీషా తదితరులు మాట్లాడారు.

గురుకుల ఉపాధ్యాయులను రాత్రి కాపలాదారు స్థాయికి దిగజార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలకు వారిపై పెరిగిన మానసిక ఒత్తిడి కారణమన్నారు. ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల పేరిట విద్యార్థులను కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో ఒత్తిడికి గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మెస్‌చార్జీలు పెంచుతామని చెప్పి రెండేళ్లు గడచినా జీవో ఇవ్వలేదన్నారు.

ఎండలను తట్టుకోవడానికి విద్యార్థులకు పుచ్చకాయలు, చల్లని మజ్జిగ, నీరు అందుబాటులో ఉండాలని ఆదేశించారనీ, అదనపు బడ్జెట్ ఇవ్వకుండా ఎలా సాధ్యమో అధికారులే చెప్పాలని వారన్నారు. ఉపాధ్యాయులపై ఇప్పటికే బోధనేతర పనుల భారం అధికంగా ఉందని, ఇప్పుడు రాత్రి డ్యూటీలో ఉండే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా వారిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని అన్నారు.

రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

'ఆప్' రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ విలువలను ధ్వంసం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువల సాక్షాత్కారానికి హామీ ఇస్తున్న రాజ్యాంగాన్ని దేశ తిరోగమన శక్తులు పార్లమెంట్ సాక్షిగా అణగదొక్కుతున్నాయని మండిపడ్డారు.

బుధవారం లిబర్టీలోగల ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం - ప్రజాస్వామ్యం - లౌకికవాదాన్ని రక్షించాలి అనే అంశంపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కమిటీ నిర్వహిస్తున్న సదస్సు పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష రాజకీయ నాయకులు, అసమ్మతివాదులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను ఉపయోగించుకుంటుందని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో ఆప్ నాయకులు బుర్ర రాముగౌడ్, నర్సింగ్ యమున గౌడ్, జావేద్ షరీఫ్, సోహెల్, టి. రాకేష్‌సింగ్, శివాజీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిని మార్చకపోతే

16న పార్లమెంట్ నియోజకవర్గాల్లో చావుడప్పు నిర్వహిస్తాం

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం శ్రీహరి కుమార్తె కావ్యను మార్చి మాదిగలకు సీటు కేటాయించకపోతే ఈనెల 16న అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చావుడప్పు కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం విద్యానగర్‌లో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలలో ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా అన్యాయం చేసిందని ఆరోపించారు.


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

కడియం శ్రీహరి మాదిగ కులస్థుడు కాదన్నారు. ఆయన కుమార్తె కావ్య ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లిం మైనారిటీని వివాహం చేసుకుందని, ఆమె మతం కూడా మార్చుకుందని, ఎస్సీ రిజర్వుడు సీటును ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పి.రమేష్, కె.వెంకట్, అంజయ్య, నరేష్, శ్రీనివాస్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సంస్థల సేవలు అపూర్వం


పారిజాతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, వీడీ రాజగోపాల్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి సాంస్కృతిక సంస్థ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్‌లు చేస్తున్న సేవలు అపూర్వమైనవని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ప్రముఖ కవి వీడీ రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య కొలకలూరి, భారతీయ అనువాద ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బిక్కి.కృష్ణ, తెలుగు-1 సంస్థ ఎండీ కె.రవిశంకర్, సాహితీవేత్తలు ఎస్.శంకరం, డాక్టర్ విద్యాధర్, రాజావాసిరెడ్డి, మల్లేశ్వరి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కవి సమ్మేళనం జరిగింది. అనంతరం ఉగాది పురస్కారాలు ప్రదానం చేసి పారిజాతం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ సేవకులు బీవీ రెడ్డి, హెచ్. మారెప్ప, కృష్ణమూర్తి, గోపాల్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడికి రిమాండ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేశాడు ఓ వ్యక్తి. గోల్నాక ప్రాంతంలో నివసిస్తున్న యువతి(29) ప్రైవేట్ ఫార్మసీ కంపెనీలో పనిచేస్తోంది. కొన్నేళ్ల క్రితం బర్కతపుర ప్రాంతంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న అఖిల్(30)అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. పెళ్లి చేసుకుంటాడని ఆమె అతడిని నమ్మింది. అవసరాల కోసం అఖిల్ యువతి వద్ద రూ. 8 లక్షలు తీసుకున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి అతడిని నిలదీయగా.. తనకు తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, నిన్ను పెళ్లి చేసుకోనని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అఖిల్‌ను అరెస్ట్ చేసి అత్యాచారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ సుభాష్ తెలిపారు.

కాచిగూడలో 21 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 21 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని సీఐ సీవీ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 16 మందికి నాంపల్లి కోర్టు జరిమానా విధించింది. ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి నాలుగు రోజులు, ఒకరికి 15 రోజులు జైలు శిక్ష విధించిందని ఆయన పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అడిక్‌మెట్ డివిజన్ పోచమ్మబస్తీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బస్తీవాసులు చెన్నకేశవులు, గోవర్ధన్, నర్సింగ్‌రావు, శ్రావణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు నారాయణగూడ డివిజన్ జలమండలి జీఎంకు బుధవారం వినతిపత్రం అందజేశారు.



- రాంనగర్, ఆంధ్రజ్యోతి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

డీడీ కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన

అంబర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డీడీ కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీసీఎస్ సైబర్ క్రైమ్ ఏసీపీ ఆధ్వర్యంలో సాయికృప రెసిడెన్సీలో స్టాక్ ట్రేడింగ్, ఫెడెక్స్ ఇన్వెస్ట్‌మెంట్, జాబ్ ఫ్రాడ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాట్సాప్, ఫోన్ మెసేజ్‌ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా సెట్టింగ్‌లపై జాగ్రత్త వహించాలని సూచించారు.

ఘనంగా పంచలోహ విగ్రహ సంప్రోక్షణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం అనంతరం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంటపారాధన, ఆవాహిత దేవత హవనము తదితర కార్యక్రమాలు జరిగాయి.

'కార్మికుల సంక్షేమానికి చర్యలు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్ తెలిపారు. బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ క్యాలెండర్-2024ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కార్మికులకు మానవతాదృక్పథంతో న్యాయసేవలు అందించాలని లేబర్‌కోర్టు న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో లేబర్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె. రఘురామ్‌రెడ్డి, ఎం మధుసూదన్, ఉపాధ్యక్షులు వై. రంజిత్‌రెడ్డి, సీహెచ్ ప్రతాప్‌లింగం తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జునస్వామి కల్యాణంలో డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, దిడ్డి రాంబాబు తదితరులు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్ బాబా మందిర ప్రాంగణంలోగల వీరభద్రస్వామి ఆలయంలో మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వీరన్నగుట్ట బస్తీ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, శ్యామ్‌మందిర్ సేవా సమితి ప్రతినిధి రాందేవ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ రైస్‌ను కొనుగోలు చేయండి

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత్ రైస్‌ను ప్రతిఒక్కరూ కొనుగోలు చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. బుధవారం చప్పల్‌బజార్ శ్రీగోవింద ట్రేడర్స్ వద్ద భారత్ రైస్‌ను పరిశీలించి కొనుగోలుదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 10 కేజీల రైస్ బ్యాగ్ 290 రూపాయలకు విక్రయిస్తున్నారని, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబర్ నమోదు చేయించి కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు లగ్నపురి సత్యనారాయణ, కృష్ణ, శ్రీగోవింద ట్రేడర్స్ యజమాని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలుదారుడికి భారత్ రైస్ బ్యాగ్ అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి


కిషన్‌రెడ్డిని గెలిపించాలని డీడీ కాలనీలో ఓటర్లను కోరుతున్న కావ్యా కిషన్‌రెడ్డి

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి, భద్రత, ధర్మపరిరక్షణ కోసం మోదీని మూడవసారి ప్రధానిని చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యకిషన్‌రెడ్డి కోరారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పాపారావు, రాంరెడ్డి, పాండురంగయ్య, భాస్కర్, వెంకటేష్‌గౌడ్, శివరాం, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ ప్రభుత్వ పథకాలు గడపగడపకూ తీసుకెళ్లండి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మోదీ మూడోసారి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో కమలం జెండా ఎగిరి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బర్కత్‌పురలో పార్టీ నగర కార్యాలయంలో అంబర్‌పేట, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్లవారీగా సమావేశాలు నిర్వహించాలని, మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని కోరారు. అంబర్‌పేట, నాంపల్లి నియోజకవర్గాలలో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి మెజారిటీ సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, యాదగిరిరెడ్డి, సందీప్ సాయి, పవన్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలె నరేంద్ర సేవలు మరువలేనివి

అంబర్‌పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి ఆలె నరేంద్ర చేసిన సేవలు మరువలేనివని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ అన్నారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆలె నరేంద్ర జయంతిని అంబర్‌పేట పటేల్ నగర్ చౌరస్తాలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో బీజేపీ బలోపేతం కావడానికి నరేంద్ర విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దాసోజు నాగభూషణం చారి, భిక్షపతి, వెంకటస్వామిగౌడ్, మాణిక్‌ప్రభు ముదిరాజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


ఆలె నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు